క్లుప్తంగా

ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు జాగ్రత్తలు పాటించాలి


పంటను పరిశీలిస్తున్న వేణుగోపాల్

హుజూరాబాద్: ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు పంటల్లో వ్యాపిస్తున్న తెగుళ్లపై జాగ్రత్తలు పాటించాలని ఉద్యానశాస్త్రవేత్త గుడిపెల్లి వేణుగోపాల్, లోహియ కంపెనీ క్షేత్ర అధికారులు సూచించారు. గురువారం ఇప్పలనర్సింగపూర్‌లో ఆయిల్‌పామ్ పంటను పరిశీలించారు. పంటలో తెగుళ్లను ముందుగా గుర్తిస్తే నివారణ చర్యలతో పంటను కాపాడుకోవచ్చన్నారు. ఉద్యానవన శాస్త్రవేత్తలు, కంపెనీ ప్రతినిధులు సూచించే మందులు పిచికారీ చేయాలని, నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం లక్ష్మణ్‌రావు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో పీఈటీగా పనిచేసిన పోలోజు ప్రతిమ పీడీ పదోన్నతితో ఇటీవల సైదాపూర్-వెన్నెంపల్లి జెడ్పీపాఠశాలకు బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా విద్యార్థులకు రూ.25 వేల విలువ గల క్రీడా దుస్తులను అందజేశారు. గురువారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం పాలాడి లక్ష్మణ్‌రావు చేతులమీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆరేళ్లు పీఈటీగా పనిచేసి ఇక్కడే పదోన్నతి రావడంతో విద్యార్థులకు తనవంతుగా సాయం చేశానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామయ్య, చింతం జ్యోత్స్న, బి శంకర్, ఎస్ రమాదేవి, వి చంద్రశేఖర్, పి. జ్యోతి పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ. 51 వేల విరాళం


విరాళం అందిస్తున్న సత్యనారాయణ

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ శ్రీభక్త మార్కండేయ ఆలయంలో నిత్యాన్నదానానికి పట్టణంలోని తిరుమల మెడికల్ షాపు యజమాని భీమనాతిని సత్యనారాయణ గురువారం రూ.51 వేల విరాళం అందించారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మచ్చ రమేశ్ కోరారు. కార్యక్రమంలో రవి, శ్రీనివాస్, భూపతి, మురళి, గౌడ ఆనంద్ పాల్గొన్నారు.

నేత కార్మికుల సంబరాలు


క్షీరాభిషేకం చేస్తున్న నేతకార్మికులు

చొప్పదండి: పట్టణంలోని చేనేత సహకార సంఘంలో మండల వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం సీఎం రేవంత్ రెడ్డి, చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. హైదరాబాద్‌లో ప్రారంభించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్స్‌టైల్స్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ సంస్థకు స్వాతంత్య్ర సమర యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టినందుకు, నేతన్నలకు రూ.30 కోట్ల రుణమాఫీ చేసినందుకు, చేనేత చేయూత పథకం ద్వారా కోటీ ముప్పై లక్షల చీరల ఆర్డర్ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు మునీందర్, ప్రధాన కార్యదర్శి రాజేశం, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్, లక్ష్మీరాజం, ఓదెలు, గంగరాజు, రాజకొమురెల్లి,కృష్ణహరి, నాగభూషణం, నర్సయ్య, జనార్దన్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


విరాళం అందిస్తున్న రమేశ్, తదితరులు

తిమ్మాపూర్: మండలంలోని పొలంపల్లి గ్రామానికి చెందిన దొబ్బల కుమార్(35) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన కుమార్‌కు భార్య ఇద్దరు పిల్లలు. మాజీ ఎంపీటీసీ బండారి రమేశ్‌గౌడ్ మిత్రుల సహకారంతో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేయాలని గ్రామస్తులను కోరారు. గ్రామ పెద్దలు, యువకులు, మాజీ ప్రజాప్రతినిధుల ద్వారా రూ.48,600 సేకరించారు. గురువారం బండారి రమేశ్, తదితరులు మృతుడి కుటుంబానికి నగదు అందించారు.

ఇలాగైతే చెరువు ఖాళీ..

- పంటలు మునిగాయని ఎస్సారెస్పీ కాలువలోకి నీటిని వదిలిన వైనం
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న ఈదులగట్టెపల్లి రైతులు, గ్రామస్తులు


కాలువలోకి వెళ్తున్న చెరువునీరు


చెరువులోని నీరు

మానకొండూర్: మండలంలోని ఈదులగట్టెపల్లి ఊరచెరువు నీరు ఎస్సారెస్పీ కాలువలోకి వృథాగా వెళ్తుండటంతో చెరువు ఖాళీ అవుతుందని గ్రామస్తులు, ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఊర చెరువు ఎస్సారెస్పీ కాకతీయ కాలువను ఆనుకొని ఉన్నా చెరువులోకి కాలువ ద్వారా నీరు వచ్చేది కాదు. నీటి ఎద్దడి ఏర్పడినప్పుడు కాలువ నుంచి చెరువులోకి నీరు రాకపోవడంతో తీవ్ర నిరాశకులోనయ్యారు. దీంతో గ్రామస్తులు, రైతులు గతంలో కాకతీయ కాలువ లైనింగ్‌కు హోల్ చేసి కాలువ నిండుగా ప్రవహిస్తున్నప్పుడు చెరువులోకి నీరు వచ్చేలా షట్టర్ ఏర్పాటు చేశారు. చెరువు నిండిన తర్వాత నీరు మళ్లీ కాలువలోకి వెళ్లకుండా మరో షట్టర్ నిర్మించారు. ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలకు ఎగువ నుంచి వచ్చిన వరదనీటితో ఊరచెరువు నిండుకోగా కొన్ని రోజులు మత్తడి దూకింది. చెరువు నిండుకోవడంతో శిఖంలోని పంటలు మునిగాయని కొందరూ షట్టర్ తెరవడంతో చెరువులోని నీరు కాలువలోకి వెళ్లోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు షట్టరు ఎత్తుకెళ్లడంతో చెరువులోని నీరు ఖాళీ అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు నీరు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


మానకొండూర్‌రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని వెల్ది-లక్ష్మీపూర్ రోడ్డు అధ్వానంగా తయారైంది. గుంతలతో వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాల బారినపడుతున్నారు. గుంతలను పూడ్చాలని, కొత్త రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజశేఖర్, ఆర్‌అండ్‌బీ ఏఈ సెల్ నం : 94408 18867

వాట్సప్ చేయండి..
మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9553955664

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


గంగాధర: మాట్లాడుతున్న ఎంపీడీవో జనార్దన్‌రెడ్డి

గంగాధర: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీవో జనార్దన్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను గురువారం ప్రారంభించారు. ఆటల్లో ప్రతిభ కనబరిచి మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. మండలం నుంచి 400 మంది విద్యార్థులు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని పీఈటీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎంఈవో వేణుకుమార్, హెచ్‌ఎం అనితాకుమారి, వేణుగోపాల్,శ్రీనివాస్, మాజీ సర్పంచు గంగాధర్, జాతీయ క్రీడాకారుడు రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని వెలిచాల జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్ ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారులు అన్ని క్రీడల్లో రాణించాలని సూచించారు. పోటీల్లో 500 మంది క్రీడాకారులు పాల్గొంటారని, వివిధ ఆటల నుంచి పన్నెండు మందిని ఎంపిక చేస్తామని తెలిపారు. హెచ్‌ఎం కన్నం రమేష్, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి దత్తాత్రేయశర్మ, పీడీలు వీరుపాల్‌రెడ్డి, రుపారాణి, ఐజాజ్ అహ్మద్, పీఈటీలు వెంకటలక్ష్మి పలువురు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్‌ఎం శ్రీనివాస్, సెక్రెటరీ ఆర్. నర్సయ్య, కె. శ్రీనివాస్, యూనిస్‌పాషా, శ్యామలాదేవి, వీరన్న, రమేశ్, సుమన్, పాషా, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

చిగురుమామిడి: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. చిగురుమామిడిలోని జెడ్పీపాఠశాల ఆవరణలో గురువారం ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, గెలుపోటములు సహజమని అన్నారు. మాజీ ఎంపీపీ కొత్త వినీత, ఎంపీడీఓ ఖాజామొయినొద్దీన్, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై బి. రాజేశ్, క్రీడల కార్యదర్శి సమ్మయ్య, హెచ్‌ఎంలు పావని, విజయలక్ష్మి, జయప్రద, రుబియా బస్రి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కిషన్‌నాయక్, బాల్‌రెడ్డి, చంద్రశేఖర్, మునిప్రసాద్, లింగారెడ్డి, మల్లేశం, రవీందర్ పాల్గొన్నారు.


చిగురుమామిడి: క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్


మానకొండూర్: కబడ్డీ ఆడుతున్న బాలికలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రామడుగు ఎంఈవో వేణుకుమార్

'అవమానిస్తే సహించం'

హుజూరాబాద్: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మహిళలను అవమానపరుస్తున్నారని, ఇలాంటివి మళ్లీ జరిగితే సహించమని మహిళా కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే చిత్రపటానికి చీర, గాజులు సారెగా అందించి నిరసన వ్యక్తం చేశారు. మహిళలు ఓటువేస్తేనే ఎమ్మెల్యే అయ్యాననే విషయం మర్చిపోవద్దని, ఎమ్మెల్యే స్థాయిలో మహిళల్ని కించపరచటం సిగ్గు చేటన్నారు. గతంలో మహిళా గవర్నర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే అధికారయంత్రాంగం హెచ్చరించినా మార్పురాలేదన్నారు. నాయకులు పుష్పలత, సుశీల, లావణ్య, రేణుక, రాధ, మల్లీశ్వరి, సునీత, స్వరూప పాల్గొన్నారు.

జమ్మికుంట: మహిళల ఓట్లు, సానుభూతో ఎమ్మెల్యేగా గెలిచి కించపరిచేలా మాట్లాడితే బుద్ధి చెబుతామని మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ దేశిని స్వప్న కోటి, కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య హెచ్చరించారు. కొత్తపల్లిలో కౌశిక్‌రెడ్డి చిత్రపటాన్ని ఫినాయిల్‌తో కడిగారు. పార్టీ మార్పులపై రాజకీయ విమర్శలు చేయాలని కానీ మహిళలను తక్కువ చేసే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు వీరన్న, భిక్షపతి, మేడిపల్లి రవీందర్, స్వరూప శ్రీహరి, పిట్టల స్వేత రమేష్, శ్రీపతినరేష్, సారంగం, రామూర్తి,గుల్లి పులమ్మ మొగిలి,దేశినరాధ సదానందం, దిడ్డి రాము, రాజు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే ఇంటిపై దాడి సరికాదు'

గంగాధర: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై పట్టపగలు దాడి చేయడం దారుణమని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఫ్యాక్షన్, రౌడీ రాజకీయాలకు రాష్ట్రాన్ని అడ్డాగా మార్చారని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యమంటే ఎమ్మెల్యేకు రక్షణ లేకపోవడమేనా, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై న్యాయపోరాటం చేస్తున్న పాడి కౌశిక్‌రెడ్డిని ప్రభుత్వం టార్గెట్ చేసిందన్నారు.

ఇల్లందకుంట: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి సిగ్గు చేటు అని హుజూరాబాద్ నియోజకవర్గ యూత్ కో- ఆర్డినేటర్ జే.కుమారస్వామి అన్నారు. దాడులకు కారణం సీఎం రేవంత్‌రెడ్డి అని దీన్ని రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ తప్పకుండా దీటుగా ఎదుర్కొంటుందని అన్నారు.

వీణవంక: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేయడం సరికాదని బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రాపర్తి అఖిల్ అన్నారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో మాట్లాడారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ వర్గీయులు అక్రమంగా కౌశిక్‌రెడ్డి నివాసంలోకి చొరబడి విధ్వంసం సృష్టించడం దుర్మార్గమైన చర్య అని, పోలీసుల సమక్షంలోనే దాడి చేశారని, ప్రశ్నించినందుకు కౌశిక్‌రెడ్డిపై దాడికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. కౌశిక్‌రెడ్డి జోలికి వస్తే సహించేది లేదని అన్నారు. ఆయన వెంట పలువురు కార్యకర్తలు ఉన్నారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన


అధికారులతో చర్చిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

హుజూరాబాద్: వినాయక నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక తెలిపారు. గురువారం పట్టణంలోని కరీంనగర్ రోడ్డులోని కాకతీయ కెనాల్ వద్ద ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. 16న జరిగే నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తాగునీరు, లైటింగ్, వైద్య శిబిరం నిర్వహించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో నిమజ్జనాన్ని విజయవంతంగా ముగించాలని కోరారు. కమిషనర్ సల్వాది సమ్మయ్య, సీఐ తిరుమల్ గౌడ్, ఎస్ఐ యూనస్ అహ్మద్‌అలీ, ఇరిగేషన్‌శాఖ డిప్యూటీ ఈఈ రాము, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, కార్యాలయ మేనేజర్ ఆర్.భూపాల్ రెడ్డి, ఇంచార్జి మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ జి. సాంబరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ దంపతులు


తిమ్మాపూర్: ప్రత్యేక పూజలో చిన్నారులు

ప్రత్యేక పూజలు, నైవేద్యం

జమ్మికుంట: మున్సిపల్ పరిధి మేదరివాడలో గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు దంపతులు, మున్సిపల్ కమిషన్ అయాజ్, తహసీల్దార్ రమేశ్, టౌన్ సీఐ వరంగంటి రవి ఆయా మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు.

గన్నేరువరం/తిమ్మాపూర్: గన్నేరువరంలో మున్నూరుకాపు, తిమ్మాపూర్‌లో వివిధ కులసంఘాల ఆధ్వర్యంలో వినాయక మండపాల వద్ద వివిధ రకాల వంటకాలతో నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.


తిమ్మాపూర్: రామకృష్ణాకాలనీలో..

రామడుగు: మండలంలోని వెదిర గ్రామ పరిధి గణేశ్‌నగర్ వినాయకుడి ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక నైవేద్యాలను సమర్పించారు. అన్నదానం చేపట్టారు.


గన్నేరువరంలో వినాయకునికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు


రామడుగు: వెదిర గ్రామ పరిధి గణేశ్‌నగర్ వినాయకుడి దేవాలయంలో కుంకుమపూజ

తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలివ్వాలి

సైదాపూర్: ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో తహసీల్దార్ మంజులకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చాలని కోరారు. ఫోరం జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి, సైదాపూర్ మండల అధ్యక్షుడు సదానందం పాల్గొన్నారు.

శంకరపట్నం: తహసీల్దార్ భాస్కర్‌కు తెలంగాణ ఉద్యమకారులు వినతిపత్రం అందించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రకటించిన హామీలు అమలు చేయాలని కోరారు. ఫోరం మండల అధ్యక్షుడు అంకూష్, తదితరులు ఉన్నారు.

వీణవంక: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ నయాబ్ తహసీల్దార్ నిజామొద్దిన్‌కు ఉద్యమకారులు వినతిపత్రం అందజేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని పేర్కొందని, మాటకు కట్టుబడి ఇంటి స్థలం అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

సంక్షిప్త వార్తలు

✦ తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం

సైదాపూర్: తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమని, పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ సీడీపీవో సుగుణ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణమాసం నిర్వహించారు. గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని సూచించారు.

✦ సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించిన డీఈఓ

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం కేజీబీవీలోని సైన్స్‌ల్యాబ్‌ను డీఈఓ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పరిశీలించారు.

✦ విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

గంగాధర: పట్టుదలతో ప్రయత్నించే విద్యార్థులకు అవకాశాలు మెండుగా లభిస్తాయని వ్యక్తిత్వ వికాస నిపుణులు వెంకట్రావు, కుతాడి తిరుపతి సూచించారు. మధురానగర్ చౌరస్తాలోని మైనారిటీ గురుకుల విద్యాలయంలో గురువారం వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. ప్రణాళికతో చదువుతూ అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు.

✦ దరఖాస్తుల పరిశీలన

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ నియామక దరఖాస్తులను అధికారులు గురువారం పరిశీలించారు. 28 మంది హాజరుకాగా తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎంఈవో మధుసూదనాచారి అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి ఐదుగురిని ఫైనల్‌కు ఎంపిక చేశారు. వీరిలో ఒకరిని ఎంపిక చేస్తామని అధికారులు తెలిపారు.

✦ కేడీసీసీబీ డైరెక్టర్‌కు సన్మానం

గన్నేరువరం: కేడీసీసీబీ డైరెక్టర్‌గా ఎన్నికైన అలువాల కోటికి మండలంలోని చాకలివానిపల్లెలో గణపతి మండపం వద్ద గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం శాలువాలతో సన్మానించారు. మండలంలోని రైతుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని కోటి తెలిపారు.

✦ పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

జమ్మికుంట: పేదలకు ఇచ్చిన నివేశన స్థలాల్లో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. తహసీల్దార్ కార్యాయం ఎదుట గురువారం పార్టీ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం 2006-07లో సర్వే నంబర్లు 275, 278లో 370 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిందిని, సౌకర్యాలు కల్పించకపోవడంతో కొందరు ఇండ్లు నిర్మించుకోగా మరికొన్ని అసంపూర్తిగా ఉన్నాయని, కిరాయి ఇంట్లో ఉంటున్నారని, ఇళ్ల స్థలాన్ని డంపింగ్‌యార్డుకు కేటాయించారని వివరించారు. అనంతరం తహసీల్దార్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు.

✦ నిధులు మంజూరు చేయాలి

వీణవంక: దళితులు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకం తీసుకొచ్చిందని, రెండో విడుత నిధులు మంజూరు చేయాలని దళిత బంధు సాధన సమితి సభ్యులు ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం సాధన సమితి ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తొమ్మిది నెలలుగా వినతి పత్రాలు ఇస్తూ అనేక నిరసనలు చేపడుతున్నా స్పందన లేదని మండిపడ్డారు.

✦ క్యాంపునకు మోడల్ స్కూల్ బృందం

వీణవంక: మండలంలోని ఘన్ముక్కుల మోడల్ స్కూల్ బృందం హైదరాబాద్‌లోని వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఇన్నోవేషన్ డిజైన్, బూట్ క్యాంపులో పాల్గొంది. రెండు రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రావణ్, పదో తరగతి విద్యార్థి భరత్‌సింహారెడ్డి పాల్గొని నూతన ఆవిష్కరణలు, పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా బృందాన్ని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, టీచర్లు అభినందించారు.

✦ ఎన్‌సీసీ అధికారికి ప్రమోషన్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ అధికారి కల్లెం రవీంద్రబాబుకు ఎన్‌సీసీలో మేజర్ స్థాయి ప్రమోషన్ వచ్చింది. కళాశాల చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, డైరెక్టర్ శంకర్‌లు అభినందనలు తెలిపారు

✦ ఆసుపత్రి అభివృద్ధికి కృషి

జమ్మికుంట: జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి అన్నారు. గురువారం ఆసుపత్రిని సందర్శించి వైద్యులు, సిబ్బంది, సౌకర్యాలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని చిల్లర చేష్టలను ప్రజలు గమనిస్తున్నారని, సెంటిమెంట్‌తో ఎమ్మెల్యేగా గెలిచి మహిళలను కించ పరిచే విధంగా మాట్లాడితే ఊరుకోబోమన్నారు.

✦ రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు

చొప్పదండి: ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ సాఫ్ట్ బాల్ జిల్లా స్థాయి పోటీల్లో పట్టణంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి పెద్దెల్లి శ్రీహరి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై ందని ప్రిన్సిపాల్ వెంకటరమణ, కరస్పాండెంట్ రత్నాకర్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికకు శిక్షణ ఇచ్చిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కృష్ణకు, సహకరించిన హెచ్‌ఎం రాజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ స్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థి ఆర్.ఆదిత్య రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 13, 14వ తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. ఆదిత్యను నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

✦ కరీంపేటలో ఒకరికి డెంగీ

శంకరపట్నం: మండలంలోని కరీంపేటలో ఒకరు డెంగీబారిన పడినట్లు వైద్యాధికారి శ్రావణ్ తెలిపారు. గ్రామంలోని జ్వరపీడితుల ఇంటి పరిసరాలను గురువారం పరిశీలించారు. గ్రామంలో డ్రైడే నిర్వహించారు, మలేరియా సిబ్బంది దోమల నివారణకు మందును పిచికారీ చేశారు.

✦ ఉత్సవ కమిటీ ఎన్నిక

రామడుగు: మండలంలోని గుండి గ్రామంలో ఉన్న శ్రీరుక్మిణిసత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయ ఉత్సవ కమిటీని గురువారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా మడ్డి అంజయ్య, ఉపాధ్యక్షులుగా నాగరాజు, శ్రీనివాస్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను మాజీ ఎంపీటీసీ శ్యాంసుందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ తిరుపతిగౌడ్ అభినందించారు.

✦ కేసు నమోదు

ఇల్లందకుంట: భూ తగాదా కారణంగా పత్తి పంటను ధ్వంసం చేసిన వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని శ్రీరాములపల్లి కి చెందిన అంబరగొండ సంజీవరావు పత్తి పంటను అదే గ్రామానికి చెందిన అంబరగొండ తిరుపతి ధ్వంసం చేశాడు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో గురువారం బీజేపీ సభ్యత్వ నమోదు పార్టీ మండల అధ్యక్షుడు అనిల్ ప్రారంభించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

వీణవంక: మండలంలోని చల్లూరులో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. దేశ అభివృద్ధిలో పీఎం మోదీ పాత్ర ఎంతో ఉందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే దేశం పురోగతి చెందిందని అన్నారు.

ఇల్లందకుంట: దేశం, ధర్మం కోసం బీజేపీలో చేరండని పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ గౌతమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని సిరిసేడు గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా గౌతమ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. దేశం, ధర్మం కోసం బీజేపీ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని అందుకు నిదర్శనం మోదీకి మూడోసారి ప్రధాని కావడమేనని అన్నారు.